నేడు ఘట్‌కేసర్ మున్సిపల్ కమిషనర్‌తో...

'సాక్షి' ఫోన్ ఇన్



ఘట్‌కేసర్: డెంగీ, మలేరియా తదితర వైరల్ జ్వరాలు విజృంభిస్తున్న నేపథ్యంలో వాటి నివారణకు తీసుకుంటున్న చర్యలపై ఘట్‌కేసర్ మున్సిపల్ కమిషనర్ సాబేర్‌అలీతో 'సాక్షి' దిన పత్రిక ఆధ్వర్యంలో శనివారం 'ఫోన్ ఇన్' కార్యక్రమాన్ని నిర్వహించనున్నాము. మధ్యాహ్నం 12 నుంచి ఒంటి గంట వరకు కమిషనర్ ఫోన్‌లో ప్రజల ప్రశ్నలకు సమాధానాలు ఇస్తారు.

ప్రజలు తాము ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం
ఫోన్: 91540 83769
లో సంప్రదించాలి.

కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ



దమ్మాయిగూడలో చెక్కులను పంపిణీ చేస్తున్న ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్యే మల్లారెడ్డి

కీసర: పేదింటి ఆడపిల్లల వివాహాలకు ప్రభుత్వం కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాల కింద ఒక్కో కుటుంబానికి రూ. 1,00,116 ప్రకారం ఆర్థిక సాయం అందజేయడం సంతోషంచదగ్గ విషయమని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి అన్నారు. శుక్రవారం దమ్మాయిగూడ మున్సిపల్ పరిధిలోని సాయి భవానీ ఫంక్షన్ హాల్‌లో దమ్మాయిగూడ పురపాలక సంఘం పరిధిలోని 55 మందికి ఆయా పథకాల కింద మంజూరైన నిధులకు సంబంధించిన చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పేదలకు మేలు చేసే సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను కొనసాగించాలన్నారు. మేడ్చల్ నియోజకవర్గంలోని ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందేలా చూస్తామన్నారు. మున్సిపల్ చైర్ పర్సన్ వసుపతి ప్రణితాగౌడ్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

మేడ్చల్ ఉమ్మడి మండలంలో...

మేడ్చల్: మేడ్చల్ ఉమ్మడి మండలంలోని 100 మందికి మంజూరైన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి, మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ పంపిణీ చేశారు. మేడ్చల్, గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలు, మేడ్చల్ మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన వంద మందికి చెక్కులు మంజూరయ్యాయి. మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మున్సిపాలిటీల వైస్ చైర్మన్‌లు రమేష్, ప్రభాకర్ కౌన్సిలర్లు బీఆర్‌ఎస్, కాంగ్రెస్, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.



జవహర్‌నగర్‌లో...

జవహర్‌నగర్ కార్పొరేషన్ పరిధిలో...

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్‌లో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాల కింద మంజూరైన లబ్ధిదారులకు ప్రభుత్వం మంజూరు చేసిన చెక్కులను ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్యే మల్లారెడ్డి పంపిణీ చేశారు. తహసీల్ మీటింగ్ హాల్‌లో కాప్రా తహసీల్దార్ సుచరిత అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మేయర్ శాంతి, మాజీ మేయర్ కావ్య, కార్పొరేటర్లు, కో ఆప్షన్ సభ్యులు, రెవెన్యూ, మున్సిపల్ సిబ్బంది, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

జ్ఞానం తరగని సంపద

ప్రముఖ కవి, రచయిత, ఎమ్మెల్సీ గోరటి వెంకన్న



నర్సింహారెడ్డి ఇంజినీరింగ్ కళాశాల ఓరియెంటేషన్ డేలో పాల్గొన్న గోరటి వెంకన్న

మేడ్చల్‌రూరల్: విద్యార్థులు ఎప్పటికప్పుడు తమ పరిజ్ఞానాన్ని పెంచుకోవాలని, జ్ఞానమే తరగని సంపద అని ప్రముఖ కవి, రచయిత, ఎమ్మెల్సీ గోరటి వెంకన్న అన్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని నర్సింహారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన ఓరియెంటేషన్ డే కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కృషితో నాస్తి దుర్భిక్షం అనే నానుడిని అనుసరించి విద్యార్థులు ఎల్లప్పుడూ కష్టపడుతూ తమ పరిజ్ఞానాన్ని, ప్రతిభను మెరుగుపర్చుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. మౌనంగా ఉంటే ఎన్నో అడ్డంకులు వాటంతట అవే సర్దుకుంటాయని మౌనం విశిష్టతను వివరించారు. కార్యక్రమంలో వక్త రామమూర్తి, కళాశాల కార్యదర్శి త్రిశూల్‌రెడ్డి, చైర్మన్ నర్సింహారెడ్డి, ప్రిన్సిపాల్ లోకనాథం, డైరెక్టర్ మోహన్, ట్రెజరర్ త్రిలోక్‌రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఐటీ కళాశాలలో...

గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి కండ్లకోయలోని సీఎంఆర్ఐటీ కళాశాలలో నిర్వహించిన ఓరియెంటేషన్ డే కార్యక్రమంలో మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి పాల్గొని విద్యార్థులనుద్దేశించి ప్రసంగించారు. కార్యక్రమంలో సీఎంఆర్ గ్రూప్స్ కార్యదర్శి గోపాల్‌రెడ్డి, సీఈఓ అభినవ్‌రెడ్డి, సీఎంఆర్ఐటీ డైరెక్టర్ జంగారెడ్డి, హెచ్‌డీ రాధాకృష్ణారెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

వాలీబాల్ టోర్నీ విజేత కిష్టాపూర్

రన్నరప్‌గా నిలిచిన పూడూర్ జట్టు

మేడ్చల్: ఫ్రెండ్లీ పోలీసింగ్‌లో భాగంగా మేడ్చల్ పోలీసుల ఆధ్వర్యంలో పట్టణంలో నిర్వహించిన వాలీబాల్ టోర్నీ విజేతగా మున్సిపల్ పరిధిలోని కిష్టాపూర్ జట్టు నిలిచింది. టోర్నీలో మేడ్చల్ మున్సిపల్‌తో పాటు మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 15 జట్లు పాల్గొనగా కిష్టాపూర్-పూడూర్ జట్లు ఫైనల్ చేరాయి. ఫైనల్స్‌లో పూడూర్ జట్టుపై కిష్టాపూర్ గెలుపొంది టోర్నీ విజేతగా నిలువగా పూడూర్ జట్టు రన్నరప్‌గా నిలిచింది. శుక్రవారం సాయంత్రం మేడ్చల్ ఏసీపీ శ్రీనివాస్‌రెడ్డి, ఇన్స్‌పెక్టర్ సత్యనారాయణ టోర్నీ విజేత జట్టుకు రూ. 20 వేల నగదుతో పాటు ట్రోఫీ అందజేయగా, రన్నరప్‌గా నిలిచిన పూడూర్ జట్టుకు రూ. 10 వేల నగదు బహుమతితో పాటు ట్రోఫీని బహూకరించారు.



టోర్నీ విజేత కిష్టాపూర్ జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న ఏసీపీ, ఇన్‌స్పెక్టర్

శామీర్‌పేట ఎస్‌ఐ మునీందర్ బదిలీ

శామీర్‌పేట్: శామీర్‌పేట పోలీస్ స్టేషన్‌లో సబ్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న మునీందర్ శుక్రవారం నార్సింగికి బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా సహచర ఎస్‌ఐలు, సిబ్బంది ఆయనకు శుక్రవారం వీడ్కోలు పలికారు. మునీందర్‌ను ఘనంగా సత్కరించి ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఎస్‌ఐలు హారిక, దశరథ, పరశురాం, సిబ్బంది పాల్గొన్నారు.



బదిలీపై వెళ్తున్న ఎస్‌ఐ మునీందర్‌ను సన్మానిస్తున్న సిబ్బంది

గణేష్ నిమజ్జనానికి ఏర్పాట్లు చేయండి

- 17 చెరువుల్లో పటిష్ట ఏర్పాట్లు చేయాలని ఆదేశం
- రూట్ మ్యాప్‌తోసహా వాహనాలను సమకూర్చుకోవాలి
- క్రేన్లు, అంబులెన్సు అందుబాటులో ఉంచాలి
- నిమజ్జన చెరువుల వద్ద వైద్య శిబిరాలు ఏర్పాటు చేయండి
- జిల్లా సమన్వయ సమావేశంలో జిల్లా కలెక్టర్ గౌతమ్



సాక్షి, సిటీబ్యూరో: మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని 17 చెరువుల్లో గణేష్ నిమజ్జనానికి అవసరమైన ఏర్పాట్లును పూర్తి చేయాలని సంబంధిత శాఖల అధికారులను కలెక్టర్ గౌతమ్ ఆదేశించారు. వినాయక నిమజ్జనానికి పటిష్ట ప్రణాళిక రూపొందించుకోవటంతో పాటు నిమజ్జనానికి అవసరమైన రూట్ మ్యాప్‌లను సిద్ధం చేసుకోవాలన్నారు. ఆయా రూట్లలో రోడ్ల మరమ్మతు పనులు వెంటనే చేపట్టి పూర్తి చేయాలని ఆర్ అండ్ బీ శాఖ అధికారులకు కలెక్టర్ సూచించారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వినాయక నిమజ్జన ఏర్పాట్లపై సమన్వయ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్లు విజయేందర్‌రెడ్డి, రాధికాగుప్తా, రాచకొండ డీసీపీ కరుణాకర్‌తో కలిసి జిల్లా సమన్వమయ సమావేశాన్ని కలెక్టర్ గౌతమ్ నిర్వహించారు. వినాయక విగ్రహాల నిమజ్జనానికి వినియోగించే వాహనాలను ముందస్తుగా రవాణా శాఖ అధికారులు సర్దిపై చేయాలని కలెక్టర్ ఆదేశించారు.

- ప్రతి గణేష్ మండపం వద్ద అవసరమైన బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. గణేష్ నిమజ్జనం సజావుగా జరిగేలా కట్టుదిట్టమైన భద్రత చర్యలు తీసుకోవాలని పోలీస్ అధికారులకు కలెక్టర్ సూచించారు.
- వినాయక నిమజ్జనానికి చెరువుల వద్ద వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి, ఫస్ట్ ఎయిడ్ కిట్లతో ఇద్దరు మెడికల్ అఫీసర్లు, సిబ్బంది 24 గంటలు షిఫ్టుల వారిగా విధులు నిర్వహించేలా చూడాలన్నారు.
- అంబులెన్సును అందుబాటులో ఉంచటంతో పాటు అత్యవసర సమయాల్లో బయటకు వెళ్లే దారి క్లియర్‌గా ఉండేలా చూడాలన్నారు. వైద్య శిబిరాలు ప్రజలకు కనిపించేలా ఏర్పాటు చేయాలన్నారు. ఎమర్జెన్సీ సందర్భాల్లో దగ్గరలో ఉన్న ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులలో ఉచితంగా ఫస్ట్ ఎయిడ్ నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని వైద్య అధికారులకు సూచించారు.
- నిమజ్జన ప్రదేశాలలో గతంలో కంటే అధిక సంఖ్యలో గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచాలని జిల్లా మత్స్య శాఖ అధికారిని కోరారు. వినాయక నిమజ్జన స్థలాల వద్ద భారీ క్రేన్లు, నిరంతరాయంగా విద్యుత్ సరఫరా ఉండేలా అవసరమైన ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రతి నిమజ్జన స్థలం వద్ద అదనపు ట్రాన్స్‌పార్మర్, పవర్ జనరేటర్లను ముందు జాగ్రత్తగా అందుబాటులో ఉంచాలన్నారు.
- కాలుష్య నియంత్రణ మండలి చెరువుల వద్ద పొల్యూషన్ లెవెల్స్ చెక్ చేస్తూ.. ఉండాలన్నారు. గణేష్ నవరాత్రులు మొదలు కొని నిమజ్జనం పూర్తయ్యే వరకు అగ్ని మాపక శాఖ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు.
- ప్రతి నిమజ్జన చెరువుకు ఒక నోడల్ ఆఫీసర్, సంబంధిత శాఖల సిబ్బందితో కూడిన బృందాలను ఏర్పాటు చేయాలన్నారు. నిమజ్జనానికి అవసరమైన క్రేన్లతోపాటు అదనంగా కొన్ని క్రేన్లను సన్నద్ధం చేయాలన్నారు.
- శామీర్‌పేట చెరువు దగ్గర అవసరమైన మొబైల్ టాయిలెట్లను ఏర్పాటు చేయాలని సంబంధిత మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు.
- ఈ సందర్భంగా భాగ్యనగర్ ఉత్సవ కమిటీ సభ్యులు పలు సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకురాగా, వాటిని వెంటనే పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. సమావేశంలో డీఆర్‌ఓ హరిప్రియ పోలీస్, ట్రాఫిక్, మత్స్య, వైద్య, అగ్నిమాపక, అర్ అండ్ బీ, పొల్యూషన్, విద్యుత్తు, జల మండలి శాఖల అధికారులు, భాగ్యనగర్ గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు, మున్సిపాలిటీల కమిషనర్లు, తహసీల్దార్లు పాల్గొన్నారు.



నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మేడ్చల్: మేడ్చల్ సబ్ స్టేషన్ పరిధిలోని ఎన్‌జీఓస్ కాలనీ ఫీడర్‌లో చెట్ల కొమ్మల నరికివేత, మరమ్మతు పనుల కారణంగా శనివారం పట్టణంలోని పలు కాలనీలలో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ శశిధర్‌రెడ్డి తెలిపారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ ఉండదన్నారు. పట్టణంలోని కిష్టాపూర్ రోడ్డు, గోకుల్ నగర్, శ్రీకాలని, కేఎల్‌ఆర్ వెంచర్ 1, 2, 3 ఫేజ్‌లలో సరఫరా ఉండదని ఏఈ వివరించారు.

పోచారం పోలీస్ స్టేషన్ భవన నిర్మాణానికి భూమిపూజ



పోచారం: వెంకటాపూర్ గ్రామ పరిధిలోని సర్వే నెంబర్ 808లో జిల్లా కలెక్టర్ కేటాయించిన 2 ఎకరాల ప్రభుత్వ భూమిలో పోచారం ఐటీ కారిడార్ పోలీస్ స్టేషన్ నూతన భవన నిర్మాయానికి మల్కాజిగిరి ఏసీపీ ఎస్.చక్రపాణి శుక్రవారం భూమిపూజ చేశారు. 2023 జూన్ 1న యంనంపేట్‌లో ఏర్పాటైన పోచారం పోలీస్ స్టేషన్‌కు వెంకటాపూర్‌లో భవన నిర్మాణం చేపట్టామని ఏసీపీ చెప్పారు. ఇన్‌స్పెక్టర్ బి.రాజు, రెవెన్యూ అధికారులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

నవరాత్రులను ప్రశాంతంగా నిర్వహించుకోవాలి

ఘట్‌కేసర్: వినాయక చవితి ఉత్సవాలు ప్రశాంతంగా నిర్వహించుకోవాలని.. ఇందుకు పోలీసులకు ప్రజలు, గణేష్ మండపాల నిర్వాహకులు సహకరించాలని ఇన్‌స్పెక్టర్ సైదులు సూచించారు. పట్టణలోని నారాయణ గార్డెన్‌లో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో వినాయక ఉత్సవ కమిటీ సభ్యులకు శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ సైదులు మాట్లాడుతూ... వినాయక మండపాల్లో లడ్డు, అఖండ దీపం విషయంలో జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. ఎదులాబాద్ శ్రీ లక్ష్మీనారాయణ చెరువులో నిమజ్జనం జరుగుతుందని, అధికారులు ఏర్పాటు చేసిన క్రేన్ల ద్వారనే నిమజ్జనం చేయాలన్నారు. అత్యవసర సమయంలో 100 నంబర్‌కు కాల్ చేయాలని సూచించారు. ఎస్‌ఐలు ప్రభాకర్ రెడ్డి, శేఖర్, శ్రీకాంత్, నర్సింహా, అధికారులు, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

'మత్తు'కు దూరంగా ఉండాలి

మేడ్చల్‌రూరల్: ఇంజినీరింగ్ విద్యార్థులు, యువత డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని మేడ్చల్ ఏసీపీ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మేడ్చల్ మున్సిపాలిటీ పరిధి కిష్టాపూర్‌లోని మల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం మేడ్చల్ పోలీసులు యాంటీ డ్రగ్స్, యాంటీ ర్యాగింగ్‌పై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ... యువత డ్రగ్స్ బారిన పడి తమ విలువైన జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. డ్రగ్స్ నిర్మూలన యువత చేతిలోనే ఉందన్నారు. కళాశాల జీవితం ఎంతో విలువైందని ర్యాగింగ్‌కు పాల్పడకుండా స్నేహ భావంతో తమ చదువులు పూర్తి చేసుకోవాలని కోరారు. ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, పోలీస్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

దమ్మాయిగూడ సర్వతోముఖాభివృద్ధికి కృషి చేయాలి

మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి



సమావేశంలో ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి తదితరులు

కీసర: దమ్మాయిగూడ మున్సిపాలిటీని అన్ని రంగాల్లో ప్రగతిపథాన తీసుకెళ్లేందుకు పాలకవర్గం చిత్తశుద్ధితో కృషి చేయాలని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం దమ్మాయిగూడ మున్సిపల్ చైర్‌పర్సన్ ప్రణితాశ్రీ కాంత్‌గౌడ్ అధ్యక్షతన నిర్వహించిన మున్సిపల్ కౌన్సిల్ జనరల్ బాడి మీటింగ్‌కు వారు ముఖ్య అతిథులుగా విచ్చేశారు. ఈసందర్భంగా ఎంపీ, ఎమ్మెల్యే మాట్లాడుతూ... నగరానికి చేరువలో ఉన్న దమ్మాయిగూడ మున్సిపాలిటీల్లో ప్రజల అవసరాల తగట్టుగా వివిధ సౌకార్యాలు కల్పించేందుకు మున్సిపల్ పాలకవర్గ సభ్యులు కృషి చేయాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ గ్రాంట్లు, మున్సిపల్ జనరల్ నిధులతో అభివృద్ధి పనులు చేపట్టాలన్నారు. మున్సిపల్ పరిధిలోని 18 వార్డుల్లో వివిధ అభివృద్ధి పనులు చేపట్టేందుకు ఒక్కో వార్డు కౌన్సిలర్‌కు రూ 30 లక్షల చొప్పున మున్సిపల్ సాధారణ నిధులను కేటాయించాలని సమావేశంలో నిర్ణయించినట్లు మున్సిపల్ చైర్ పర్సన్ ప్రణితాశ్రీకాంత్‌గౌడ్, కమిషనర్ నాగమణి తెలిపారు. భవానీనగర్ కాలనీలోని ఓపెన్ నాలకు గ్రిల్స్ ఏర్పాటు, మున్సిపాలిటీకి సంబంధించిన వాహనాలకు జీపీఎస్ ట్రాక్ ఏర్పాటు, రానున్న వినాయక చవితి ఉత్సవాల నిర్వహణ ఏర్పాట్లు చేసేందుకు రూ. 9 లక్షలను కేటాయించాలని సమావేశంలో నిర్ణయించినట్లు వివరించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ మాదిరెడ్డి నరేందర్‌రెడ్డి, కమిషనర్ నాగమణి, కౌన్సిలర్లు, మేనేజర్ వెంకటేష్, కో ఆప్షన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో పరిపూర్ణ ఆరోగ్యం

నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి



నాగారంలో ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో పాల్గొన్న చైర్మన్ చంద్రారెడ్డి తదితరులు

కీసర: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం వల్ల రోగాలు దరిచేరవని నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి అన్నారు. ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పురపాలక సంఘం పరిధిలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా వివిధ కాలనీలో నిల్వ నీటిలో ఆయిల్ బాల్స్, టీమో పాస్ స్ప్రే, బ్లీచింగ్ పౌండర్ చల్లించే కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. మలేరియా, డెంగీ వ్యాధుల నివారణకు దోమలు ఆరికట్టే క్రమంలో అవి వృద్ధి చెందే ప్రదేశాలైన మంచినీటి నిల్వ ఉండే వస్తువులు ఎయిర్ కూలర్లు, డ్రమ్ములు, నీటి తొట్లు, టైర్లు తదితరవాటిలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. పాత టైర్లు, డబ్బాలు, పాత్రలు, ఇంటి పరిసరాల్లోకి వచ్చే మున్సిపల్ చెత్త బండికి అందించాలన్నారు. పరిసరాల పరిశుభ్రంగా ఉంచుకోవడం వల్ల తమ అర్యోగం కాపాడుకోవడంతోపాటు, సమాజానికి కుడా కొంత మేలు చేసిన వారవుతామన్నారు. మున్సిపల్ పరిధలో ఫ్రైడే, డ్రైడే కార్యక్రమాన్ని అందరి సహకారంతో విజయవంతం చేస్తున్నామన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్ బండారి మల్లేష్‌యాదవ్, కమిషనర్ రాజేంద్ర కుమార్, 6వ వార్డు కౌన్సిలర్ కౌకుట్ల అనంతరెడ్డి, మునిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

కమిషనర్ వేమనరెడ్డి సేవలు అభినందనీయం



కమినషర్ వేమనరెడ్డిని సత్కరించిన చెర్మన్ కొండల్‌రెడ్డి తదితరులు

పోచారం: పోచారం మున్సిపల్ కమిషనర్‌గా వేమనరెడ్డి అందించిన సేవలు అభినందనీయమని చైర్మన్ బోయపల్లి కొండల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం అన్నోజిగూడలోని తులిప్స్ గ్రాండ్ హోటల్‌లో కమిషనర్ పశ్య వేమనరెడ్డి పదవీ విరమణ సందర్భంగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గతంలో ఘట్‌కేసర్ మున్సిపాలిటీ కమిషనర్‌గానూ వేమనరెడ్డి విధులు నిర్వర్తించారన్నారు. చిరునవ్వుతో ప్రజా సమస్యల పరిష్కారానికి ఆయన చేసిన కృషి అనిర్వచనీయమన్నారు. పోచారం పురపాలక సంఘ పాలకవర్గంతో పాటు ఘట్‌కేసర్ మున్సిపాలిటీకి చెందిన ప్రజాప్రతినిధులు, తోటి అధికారులు, సిబ్బంది వేమనరెడ్డి దంపతులను శాలువాలు, పూలదండలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ రెడ్యానాయక్, ఘట్‌కేసర్ మున్సిపాలిటీ చైర్ పర్సన్ ముల్లి పావని జంగయ్య యాదవ్, కౌన్సిలర్లు గొంగళ్ల మహేష్, నర్రి ధనలక్ష్మి, చింతల రాజశేఖర్, భైర హిమ, బెజ్జంకి హరిప్రసాదరావు, ఆకిటి శైలజ, బాలగోని వెంకటేష్ గౌడ్, నల్లవెళ్లి లక్ష్మి, అబ్బవతిని సరిత, మోటుపల్లి పోచమ్మ, సామల శ్రీలత, సుర్వి రవీందర్, కో ఆప్షన్ సభ్యులు దాసరి శంకర్, అక్రమ్ అలీ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ బిల్లులు వెంటనే చెల్లించాలి



మాట్లాడుతున్న బాలమల్లేష్

కీసర: రాష్ట్రంలో ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న వ్యవసాయ కూలీలకు పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాలమల్లేష్ డిమాండ్ చేశారు. శుక్రవారం కీసరలో జరిగిన కార్మిక సంఘ 4వ మహాసభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో నిరుద్యోగం, పేదరికం, అవినీతి పెరిగిపోతోందని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో అనేక చోట్ల సెల్ టవర్ల లేకపోవడంతో ఫొటోలు అప్‌లోడ్ చేయలేకపోవడంతో ఉపాధి హామీ కార్మికులకు వేతనాలు సక్రమంగా అందడంలేదన్నారు. పట్టణ ప్రాంతాల్లోనూ ఉపాధి హామీ పథకాన్ని అమలు చేయాలని కోరారు. అనంతరం సంఘ జిల్లా కమిటీ అధ్యక్షుడుగా టి.రాములుగౌడ్, ఉపాధ్యక్షులుగా కె.మహాలక్ష్మి, సాయిలుగౌడ్, ప్రధాన కార్యదర్శిగా శంకర్ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి సాయిలుగౌడ్, రైతు సంఘ గౌరవ అధ్యక్షుడు దశరథ్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ సభ్యత్వ నమోదు సన్నాహక సమావేశం



సమావేశంలో పాల్గొన్న బీజేపీ నాయకులు, కార్యకర్తలు

పోచారం: అన్నోజిగూడలో బీజేపీ సభ్యత్వ నమోదు సన్నాహక సమావేశం పోచారం మున్సిపల్ అధ్యక్షుడు సురేష్ నాయక్ అధ్యక్షతన శుక్రవారం జరిగింది. సమావేశానికి జిల్లా ఉపాధ్యక్షుడు రాసాల నర్సింగరావు ముఖ్య అతిథిగా విచ్చేసి సభ్యత్వ నమోదుకు సంబంధించిన పలు అంశాలపై కార్యకర్తలకు అవగాహన కల్పించారు. సెప్టెంబర్ 5వ తేదీన బూత్ అధ్యక్షులు ఆయా బూత్‌ల వారీగా సభ్యత్వ నమోదును ప్రారంభించాలని నిర్ణయించారు. సమావేశంలో రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ అచ్చిని నర్సింహ, జిల్లా నాయకులు కిషన్‌నాయక్, గొంగళ్ల బాలేష్, రావుల శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడాపోటీల విజేతలకు బహుమతుల ప్రదానం



సాక్షి, సిటీబ్యూరో: జాతీయ క్రీడా దినోత్సవాలను పురస్కరించుకుని కలెక్టరేట్‌లో ఉద్యోగులు, సిబ్బందికి నిర్వహించిన ఆటల పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు జిల్లా అదనపు కలెక్టర్ రాధికా గుప్తా బహుమతులు అందజేశారు. శుక్రవారం కలెక్టరేట్‌లో 50 మీటర్స్ వాకింగ్, 100 మీటర్స్ వాకింగ్, 50 మీటర్స్ రన్, 100 మీటర్స్ రన్, లెమన్ స్పూన్, మ్యూజికల్ చైర్, టగ్ ఆఫ్ వార్, షార్ట్ పుట్, చెస్, వాలీబాల్, క్రికెట్ పోటీల్లో గెలుపొందిన ఉద్యోగులు, సిబ్బందికి బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ హరిప్రియ, జిల్లా లా ఆఫీసర్ చంద్రావతి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సైదులు, అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ రాంమోహన్, వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అన్నదానం.. పుణ్యకార్యం



కీసర: ఆకలితో ఉన్న వారికి అన్నదానం చేయడం పుణ్యాకార్యమని.. ఇందుకు ప్రతిఒక్కరూ చేయూత ఇవ్వాలని కీసరగుట్ట రామలింగేశ్వర స్వామి ఆలయ చైర్మన్ తటాకం నాగలింగం పేర్కొన్నారు. కీసరగుట్టలో భక్తులకు నిత్యాన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. శుక్రవారం కీసరగుట్టలోని అన్నదాన సత్రంలో దేవస్థానం ఆధ్వర్యంలో భక్తులకు ఏర్పాటు చేసిన అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ... కీసరగుట్టకు వచ్చే భక్తులు అన్నదాన కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. భక్తులు ఎవరైనా అన్నదాన కార్యక్రమానికి విరాళాలను ఇవ్వాలనుకుంటే దేవస్థానం ఈఓ కార్యాలయంలో సంప్రదించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఈఓ సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యువకుడి హత్య కేసులో నిందితుల రిమాండ్

మేడ్చల్‌రూరల్: మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఇటీవల జరిగిన హత్య కేసులో నిందితులను పోలీసులు శుక్రవారం అరెస్టు చేసి రిమాండుకు తరలించారు. మేడ్చల్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మేడ్చల్ ఏసీపీ శ్రీనివాస్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణతో కలిసి వివరాలను వెల్లడించారు. మృతుడు తాళ్లబత్తుల కళ్యాణ్ మేడ్చల్ పారిశ్రామిక వాడలోని కేఎంపీ కంపెనీలో పనిచేస్తున్న సమయంలో మండలంలోని గౌడవెల్లి గ్రామానికి చెందిన నిందితుడు సప్పతి శివకుమార్(26) స్నేహం ఏర్పడింది. గతంలో మృతుడు కళ్యాణ్ శివకుమార్ ఇంట్లో నుంచి ఎవరికీ చెప్పకుండా తీసుకున్న రూ. 20 వేల నగదు తిరిగి ఇవ్వకుండా తప్పించుకు తిరుగుతున్నాడు. కంపెనీలో విధులు మానేసి కళ్యాణ్ ప్లంబర్ పని చేస్తూ జీవనం సాగిస్తుండగా శివకుమార్ కార్పెంటర్‌గా పనిచేస్తున్నాడు. ఇద్దరు మద్యానికి బానిసలుగా మారారు. గత బుధవారం సాయంత్రం మేడ్చల్ పట్టణంలోని తేజ వైన్స్ సమీపంలో మృతుడు కళ్యాణ్ శివకుమార్‌కు కనిపించడంతో డబ్బులు అడగగా ఇవ్వకపోవడంతో నిందితుడు శివకుమార్ తన సోదరుడు మహేందర్, బావమరిది సాయికుమార్‌లకు సమాచారం ఇచ్చాడు. డబ్బు వసూలు చేసేంకు యత్నించగా ఇవ్వకపోవడంతో ముగ్గురు కలిసి అతనిపై దాడికి పాల్పడ్డారు. కళ్యాణ్ స్పృహ తప్పి పడిపోవడంతో ముగ్గురు పరారయ్యారు. శుక్రవారం ఉదయం మేడ్చల్ పోలీసులు గౌడవెల్లి చౌరస్తా వద్ద నిందితులు శివకుమార్, మహేందర్, సాయికుమార్‌లను అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు.